# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 21 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 5


## టికెట్ ధరల పెంపు ఉత్తర్వులు విడుదలకు 90 రోజుల ముందే జారీ చేయాలి


- హోంశాఖకు హైకోర్టు ఆదేశాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చిత్రాల టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను సినిమా విడుదలకు కనీసం 90 రోజుల ముందే జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర టికెట్ ధరల పెంపుపై ఈ నెల 9న హైకోర్టులో వాదనలు జరిగాయి. ఈ చిత్రానికి సంబంధించి టికెట్ ధరలు పెంచుతూ ఈ నెల 8న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అయితే ఆ ఉత్తర్వులను కోర్టు దృష్టికి ప్రభుత్వ న్యాయవాది (జీపీ) తీసుకురాలేదని విజయ్ గోపాల్ కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో స్పందించిన హైకోర్టు, ఇకపై సినిమా టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను చిత్ర విడుదలకు 90 రోజుల ముందే జారీ చేయాలని హోంశాఖను ఆదేశించింది.టికెట్ ధరల పెంపు వ్యవహారంలో కోర్టు ఆదేశాలను పాటించలేదని పేర్కొంటూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. ఈ మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ అయ్యాయి. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర టికెట్ ధరల పెంపు అంశంలో పూర్తి కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది.

# 7 గంటల విచారణ

- సిట్ ఎదుట హాజరైన హరీశ్‌రావు
- ఏసీపీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు, అరెస్టులు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును సిట్ అధికారులు దాదాపు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. మధ్య మధ్యలో విరామమిస్తూ అధికారులు హరీశ్‌రావుకు ప్రశ్నలు సంధించారని తెలిసింది.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో సిట్ ఇచ్చిన నోటీసు మేరకు హరీశ్‌రావు.. ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అనుచరులు వెంట రాగా మొదట బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు కార్యకర్తలు, నాయకులతో మాట్లాడిన హరీశ్‌రావు తిరిగి జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి ఉదయం 11 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. వెలుపల వేచి ఉన్న మీడియా ప్రతినిధులకు అభివాదాలు తెలుపుతూ రాజకీయ కక్షతోనే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకే సిట్ అధికారులు తనను పిలిచారనీ, ఇదంతా ఒక డ్రామా అంటూ ఏసీపీ కార్యాలయంలోకి వెళ్లారు. లోపల హరీశ్‌రావు కోసం వేచి ఉన్న సిట్ అధికారులు నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ కమాండెంట్ రవీందర్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి విచారణను ప్రారంభించారు.

హరీశ్‌రావును మొదట ఎందుకు పిలిపించినట్టో కారణాలు తెలిపిన అధికారులు.. అనంతరం ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఇప్పటి వరకు తాము విచారించిన అధికారులు మీ పేరునే చాలా సందర్భాల్లో బయటపెట్టారు. ఇందులో మీ పాత్ర ఎంత అని ప్రశ్నించగా.. అందుకు మీ వద్ద ఉన్న ఆధారాలు ఏంటనీ హరీశ్‌రావు ఎదురు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఓ ప్రయివేటు న్యూస్ ఛానెల్ సీఈఓ శ్రవణ్‌రావులు చాలా సార్లు మీరిచ్చిన ఆదేశాలు, పంపిన ఫోన్ నెంబర్లు, తెలిపిన పేర్ల ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిపి, సమాచారాన్ని మీకు పంపినట్టు తెలిపారని సిట్ అధికారులు తెలపగా .. తాను హోం మంత్రిని కాదనీ, తనకు ఈ విషయంతో సంబంధం లేదని హరీశ్‌రావు సమాధానం ఇచ్చినట్టు సమాచారం. శ్రవణ్‌రావు ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి సేకరించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలోని భవనంలో అమర్చి ట్యాపింగ్ వ్యవహారాన్ని జరపడం వెనక మీ హస్తం ఉందంట కదా అనే ప్రశ్నకు... అనేక మంది అనేక విషయాలు

మిగితా 5వ పేజీలో

## తొలి రోజే
# తెలంగాణ రైజింగ్ బృందం బిజీబిజీ

- ఇజ్రాయెల్, యూఏఈ, గూగుల్, ఫిలిప్స్‌తో కీలక భేటీలు
- ఏఐతో మెరుగైన పాలన
- దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో సీఎం ఏ రేవంత్‌రెడ్డి
- ఇజ్రాయెల్‌తో స్టార్టప్, ఇన్నోవేషన్ భాగస్వామ్యం
- భారత్ ఫ్యూచర్ సిటీపై యూఏఈ ఆసక్తి
- ఫిలిప్స్‌తో ఏఐ-హెల్త్‌టెక్ భాగస్వామ్యం
- గూగుల్‌తో వ్యూహాత్మక సహకారం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచ ఆర్థిక వేదిక -2026 వార్షిక సదస్సు వేదికైన దావోస్?లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం తొలి రోజున బిజీబిజీగా గడిపింది. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం పలు అంతర్జాతీయ సంస్థలు, దేశాల ప్రతినిధులతో కీలక సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధి దిశను ప్రపంచానికి వివరించింది.

**ఇజ్రాయెల్‌తో స్టార్టప్, ఇన్నోవేషన్ భాగస్వామ్యం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారం, ఏఐ, డీప్‌టెక్, హెల్త్‌టెక్, అగ్రి-టెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతుపై విస్తృతంగా చర్చించారు. ఇజ్రాయెలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణలో పైలట్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించేందుకు అంగీకారం కుదిరింది.

**భారత్ ఫ్యూచర్ సిటీపై యూఏఈ ఆసక్తి**

భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందంతో జరిగిన సమావేశంలో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు.

ఈ సందర్భంగా సీఎం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్?ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్?ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని, సుమారు 30 వేల ఎకరాల్లో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మారుబెనీ, సెమ్?కార్ప్ భాగస్వాములుగా ఉన్నాయని, రిలయన్స్ గ్రూప్ 'వన్?తారా' జూ పార్క్ కోసం ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వేగవంతానికి సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని యూఏఈ మంత్రి సూచించారు.

**ఫిలిప్స్‌తో ఏఐ-హెల్త్‌టెక్ భాగస్వామ్యం**

ప్రపంచ ప్రఖ్యాత హెల్త్‌టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ తెలంగాణతో ఏఐ రంగంలో భాగస్వామ్యం కావడానికి ఆసక్తి వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై చర్చలు జరిపింది. ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్ స్కేజ్రోండ్?తో జరిగిన సమావేశంలో 'తెలంగాణ నెక్స్ట్--జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026--2030'ను వివరించారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగాన్ని 250 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే లక్ష్యమని తెలిపారు.

హైదరాబాద్ ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని పెరి--అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్ ఉన్నాయని మంత్రులు వివరించారు. హైదరాబాద్‌ను ఏఐ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**గూగుల్‌తో వ్యూహాత్మక సహకారం**

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్యం, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ముందుకొచ్చింది. గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై CURE, PURE, RARE అభివృద్ధి నమూనాలను వివరించారు. హైదరాబాద్?ను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను ప్రస్తావించారు.

**ఏఐతో సమర్థ పాలన లక్ష్యం**

ఏఐను వినియోగించి పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. 'ఇంటెలిజెంట్ ఇన్?ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కాంపెటిటివ్?నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తూ, రైతు భరోసా, ఆస్తి పన్ను, సంక్షేమ పథకాలు, మున్సిపల్ సేవల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మేధోవంతమైన వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో వివిధ దేశాలకు చెందిన నిపుణులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని స్మార్ట్ సిటీలు, స్మార్ట్ ఫ్యాక్టరీలు, స్థిరమైన ఇంధన వ్యవస్థలపై చర్చించారు.

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశం
- ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలకు జరగబోయే రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుర్తించిన పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్లను మ్యాపింగ్ చేయడంపై దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు. గురువారం ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు.

మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం శనివారమే లేఖ రాసింది. రిజర్వేషన్ల ప్రక్రియ వివరాలను సమర్పించిన నేపథ్యంలో ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నట్టు ఎన్ఈసీకి తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మెన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్ఈసీకి పంపింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు లాటరీ విధానంలో రిజర్వేషన్లను పూర్తి చేసింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీలు, 2,996 వార్డులకు రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహిం చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

## చలాన్ల పేరుతో వాహనదారులను వేధించొద్దు

- ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు
- బలవంతపు వసూళ్లు, కీలు లాక్కోవడం నిషేధం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల పేరుతో వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దని హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చలాన్లు చెల్లించాలంటూ బైక్ కీలు లాక్కోవడం, రోడ్డుపైనే వాహనాలను ఆపివేయడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది.వాహనాన్ని ఆపిన సమయంలో వాహనదారులు స్వచ్ఛందంగా చలాన్లు చెల్లించేందుకు ముందుకొస్తే మాత్రమే పోలీసులు వసూలు చేయవచ్చని స్పష్టం చేసింది. చలాన్ చెల్లించడానికి వాహనదారులు నిరాకరిస్తే చట్ట ప్రకారం కోర్టు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా పెండింగ్ చలాన్లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పిటిషనర్ తరఫున న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. రోడ్డు మీద వాహనదారులను నిలిపి ఇబ్బంది పెడుతూ చలాన్లు వసూలు చేస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ట్రాఫిక్ పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన వైఖరి అవలంబించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంక్ ఖాతా వివరాలను తీసుకుని వాహనానికి లింక్ చేయాలన్న ప్రతిపాదనపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. చలాన్ పడిన వెంటనే ఖాతా నుంచి డబ్బులు కట్ అవ్వాలన్న వ్యాఖ్యలపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే హైకోర్టులో పిటిషన్ దాఖలై, న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది.

## మేడారంలో పనులు నిలిపివేత

- భక్తుల సంఖ్య పెరుగుతండడంతో ఇబ్బందులు రాకుండా నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం వద్ద అభివృద్ధి పనులను నెలరోజుల పాటు నిలిపివేశారు. ఆది, సోమవారాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు కేబినెట్ భేటీ, బహిరంగసభ అనంతరం ఈ పనులను అధికార యంత్రాంగం నిలిపివేసింది. సోమవారం గద్దెలు, ప్రాంగణం పునర్నిర్మాణ పనుల పైలాన్‌ను ఆవిష్కరించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం విదితమే. సీఎం పర్యటన నేపథ్యంలో రాత్రింబవళ్లు పనులు చేసి గద్దెలు, ప్రాంగణం, ప్రాకారం పనులను కొలిక్కి తీసుకువచ్చినా, మరో నెల రోజుల పాటు చేయడానికి పనులు మిగిలిపోయి ఉన్నాయి. ఈలోపు జాతర సమీపించడం, భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పనులు కొనసాగిస్తే భక్తులకు తీవ్ర ఆటంకం కానుంది. ఈ నేపథ్యంలో భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశముందని భావించిన అధికారులు.. పనులను వెంటనే నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. జాతర ముగిసే వరకు గద్దెలు, ప్రాకారం వద్ద పనులు జరగవు. జాతర ముగిశాక మరో నెల రోజుల్లో పనులను పూర్తి చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

## భైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు--కంటైనర్ ఢీ.. నలుగురు అక్కడికక్కడే మృతి
- ఇద్దరి పరిస్థితి విషమం

**బలగం టీవీ, నిర్మల్**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. భైంసా బస్ డిపో సమీపంలో కారు, కంటైనర్ లారీని ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులు నిర్మల్ జిల్లా కుబేర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన బాబన్న, భోజరాం పటేల్, రాజన్న, వికాస్‌గా గుర్తించారు. వీరంతా హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కారు అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ఘటనతో ఆ మార్గంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మేడారం జాతరకు 4 వేల ప్రత్యేక బస్సులు

- 51 సెంటర్ల నుంచి ఆర్టీసీ సేవలు
- మహిళలకు ఉచిత ప్రయాణం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మేడారం సమ్మక్క--సారలమ్మ జాతరకు రాష్ట్రవ్యాప్తంగా 51 సెంటర్ల నుంచి 4 వేల ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారానికి వెళ్లే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. జాతర విధుల్లో రవాణా శాఖ నుంచి మొత్తం 10,441 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని వెల్లడించారు.మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆరచవతీచంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**28 నుంచి స్పెషల్ బస్సులు**


మేడారం విధుల్లో సుమారు 7 వేల మంది డ్రైవర్లు, 18 వేల మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. మేడారానికి వెళ్లే సమయంలో బస్సులు నిండుగా ఉంటాయని, తిరిగి వచ్చే సమయంలో ఖాళీగా ఉంటాయని వివరించారు. వన్?వే ప్రయాణంలో బస్సులు ఖాళీగా వెళున్నందున రెగ్యులర్ ఛార్జీలపై 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నట్లు వెల్లడించారు.

**20 లక్షల మంది ప్రయాణం అంచనా**

మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో సుమారు 20 లక్షల మంది భక్తులు ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50 ఎకరాల విస్తీర్ణంలో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా రవాణా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తుల భద్రత కోసం బస్టాండ్లలో క్లోజ్డ్ సర్క్యూట్ (సీసీ) కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్?కు అనుసంధానం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

## రూ.100 కోట్లతో యాదగిరిగుట్ట అభివృద్ధి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు
- యాదగిరిగుట్టలో 'ఇందిరా మహిళా శక్తి సంబరాలు'లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

యాదగిరిగుట్ట పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. త్వరలోనే రూ.100 కోట్ల వ్యయంతో పట్టణంలో అండర్?గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.రూ.210 కోట్లతో చేపట్టిన పైప్?లైన్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రతి ఇంటికి గోదావరి జలాలు అందుతాయని హామీ ఇచ్చారు. గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు నియోజకవర్గ పరిధిలో సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి సంబరాలు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మెప్మా ఆధ్వర్యంలో 87 స్వయం సహాయక సంఘాలకు వివిధ బ్యాంకులు, శ్రీనిధి సహకారంతో రూ.12 కోట్ల 73 లక్షల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని సంఘాలకు రూ.98 లక్షల 23 వేల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు 'పుట్టింటి సారె'గా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల సంక్షేమం కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 265 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఇందుకోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్లను వెచ్చిస్తోందని తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో కొత్తగా 16,152 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశామని, పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా పెట్రోల్ బంకులను కూడా మహిళల పేరుతోనే కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. 18 నుంచి 100 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామని తెలిపారు. యాదగిరిగుట్టను అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.

## అంధ విద్యార్థుల హాస్టల్స్ మూసివేతపై నివేదిక సమర్పించాలి

- హైదరాబాద్ కలెక్టర్‌కు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంక్రాంతి సెలవుల తర్వాత అంధ విద్యార్థుల వసతి గృహాలు తెరవకపోవడంపై సమగ్ర వాస్తవ నివేదిక సమర్పించాలని హైదరాబాద్ కలెక్టర్‌ను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. హాస్టళ్లు తెరవలేదని ఒక పత్రికలో వచ్చిన వార్తను కమిషన్ సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. హైదరాబాద్‌లోని దారుల్షిఫా, మలక్‌పేట్ ప్రాంతాల్లో ఉన్న అంధ విద్యార్థుల ప్రభుత్వ వసతి గృహాల మూసివేత కారణంగా సుమారు 120 మంది దృష్టి లోపం గల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్ గుర్తించింది. సంబంధిత శాఖల మధ్య పరిపాలనా అయోమయం ఇందుకు కారణమని గమనించింది. వసతి గృహాల మూసివేతతో నివాసం, ఆహారం, విద్యకు ప్రాధాన్యత కోల్పోవడం జరిగిందనీ, ఇది భారత రాజ్యాంగం, వికలాంగుల హక్కుల చట్టం, 2016 కింద హామీ ఇచ్చిన హక్కుల ఉల్లంఘనగా ప్రాథమికంగా కనిపిస్తున్నదని కమిషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో నివేదిక కోసం విచారణను ఫిబ్రవరి 16న ఉదయం 11 గంటలకు వాయిదా వేసింది.

## కాంగ్రెస్ వైఫల్యాలు, అవినీతిపై ప్రశ్నిస్తూనే ఉంటాం




- అటెన్షన్ డైవర్షన్‌కు ప్రయత్నం
- సింగరేణిలో జరుగుతున్న ఈ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 5వ పేజీలో

# వేములవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యం



- అన్ని వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కుల సంఘ భవనాల నిర్మాణాలకు మంజూరు పత్రాలు అందజేత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అన్ని వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండగా ఉంటుందని, ప్రజా ప్రభుత్వంలో వేములవాడ సమగ్ర అభివృద్ధి లక్ష్యముగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ పట్టణంలోని పలు కుల సంఘ భవనాల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, ఈ సందర్భంగా భగవంతరావు నగర్ యాదవ సంఘం, లక్ష్మీపురం పెద్దమ్మల సంఘాలకు మంజూరు పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుల సంఘ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత పది సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం రెండు సంవత్స రాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని అన్నారు. వేములవాడ పట్టణంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ సమస్యలు యథాతథంగా ఉన్నాయని చెబుతున్నారని, గత పాలకులు వేములవాడ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం రాజన్న ఆలయానికి ఏటా రూ.100 కోట్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని, రాష్ట్రం ఏర్పడకముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉందని,ఒక్క కొత్త ఇటుక కూడా పెట్టలేదన్నారు. అయితే రాజన్న ఆలయం మరో వెయ్యేళ్ల పాటు నిలిచేలా అధునాతన పద్ధతిలో విస్తరణ చేపడుతు న్నామని,నిన్నటి రోజున ఆలయంలో రాఫ్టింగ్ పనులు పూర్తయ్యాయని అన్నారు.

గత ఎన్నికల సమయంలో ప్రజల మద్దతు కోరుతూ వారి మధ్యకు వచ్చామని, అప్పట్లో ఇచ్చిన స్ఫూర్తిని ఎప్పటికీ మరిచిపోలేమని, ఇచ్చిన మాట ప్రకారం నేడు ప్రజలకు అండగా నిలుస్తున్నామని,వేములవాడలో మూడో బ్రిడ్జి నిర్మాణం తుదిదశకు చేరుకుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ,వేములవాడ పట్టణంతో పాటు రాజన్న ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వేములవాడలో 42 కుల సంఘాలకు నిధులు మంజూరు చేశామని, చౌడాలమ్మ దేవాలయానికి స్థలం కేటాయించామని, పెద్దమ్మల కాలనీలో హామీ ఇచ్చినట్లుగానే నిధులు మంజూరు చేశామని అన్నారు. పెద్దమ్మల సంఘానికి రూ.16 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టామని, పెద్దమ్మల కాలనీలో ఇల్లు లేని 19 మందికి త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అలాగే కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామని,ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యత తమదేనని అన్నారు.

వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ఎమ్మెల్యేగా తాను, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# సిరిసిల్ల జిల్లాలో చెరువుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల జిల్లాలో గుర్తించిన చెరువులు, రిజర్వాయర్ల (వెట్ల్యాండ్స్) సంరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ, నీటి పారుదల, సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. చెరువులు, రిజర్వాయర్ల (వెట్?ల్యాండ్స్) సహజంగా నీరు నిల్వ ఉండే తడిసిన భూములు ప్రకృతి సమతుల్యతకు కీలకమని, ఇవి భూగర్భ జలాల పెరుగుదలకు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.పలు వెట్ల్యాండ్స్‌ను గుర్తించి మ్యాపింగ్ చేసి, వాటి అభివృద్ధి కోసం అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎంపిక అయిన జలవనరులను అభివృద్ధి, మరమ్మత్తు పనులను చేస్తారని పేర్కొన్నారు. దీంతో పక్షులు, జంతువులకు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పర్యాటక రంగం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ



సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, ఈఈలు సంతు ప్రకాశ్, ప్రశాంత్, డీఈలు, ఏఈలు, ఎఫ్ఆర్ఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో 'ఆపరేషన్ స్మైల్'..



**బలగం టీవీ, వేములవాడ:**

ఆపరేషన్ స్మైల్ లో భాగంగా వేములవాడ లో రెస్క్యూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల కోసం, రక్షణ లేని వారి కోసం, వెలివేయబడ్డవారి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశాలతో పోలీస్ డిపార్ట్మెంట్ సహాయంతో రెవెన్యూ డిపార్ట్మెంట్ వైద్య ఆరోగ్యశాఖ దేవాలయ అధికారుల సహాయ సహకారాలతో జిల్లా సంక్షేమ శాఖ పర్యవేక్షణలో దేవస్థాన ప్రాంగణ పరిధిలో యాచకులను రక్షణ అవసరం ఉన్నవారిని గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 74 మందిని గుర్తించడం జరిగింది. వీరిలో ఒక పాప బాబు (ఇద్దరు పిల్లలు), ట్రాన్స్ జెండర్లు 20 మంది, 52 మంది ఒంటరి మహిళలు మరియు వృద్ధులను గుర్తించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ముఖ్యంగా కొంతమంది వయో వృద్ధుల సంతానం/ కొడుకులు/ బిడ్డలు వయోవృద్ధులను వదిలివేయడం గుర్తించడం జరిగింది. ఇట్టి విషయంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ వారికి సమాచారం అందించడం జరిగింది. వయోవృద్ధుల -తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం ప్రకారం వారిపై తగు చర్యలు తీసుకోబడతాయని తెలియజేయడం జరిగింది. అలాగే ట్రాన్స్ జెండర్లు ఎవరైనా భక్తులను ఇబ్బంది కలిగించకూడదని వారు యాచనా చేయకూడదని సూచించడం జరిగింది.ఒకవేళ ఎవరైనా దేవాలయ పవిత్రతను భంగం చేస్తూ భిక్షాటనను ప్రోత్సహించిన భిక్షాటన చేసిన వారిపై చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. అలాగే రాజన్న దర్శనానికి వచ్చిన భక్తుల మనోభావాలను దెబ్బ తినకుండా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆలయ ప్రాంతంలో ఉంటున్న వారికి సూచించడం జరిగింది. ఆలయ ప్రాంతం పరిసరాలలో గాని జిల్లాలో ఎక్కడైనా కానీ పిల్లలు భిక్షాటన చేసినట్లుగాని బాల కార్మికులుగా గాని కనిపిస్తే 1098కు మహిళలు వయోవృద్ధులు కనిపిస్తే 181 టోల్ ఫ్రీ కి గాని 100 లేదా 112 నంబర్ కి గాని తెలియజేయాలని ఈ సందర్భంగా సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డి చంద్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం, జఔజ చైర్మన్ సి అంజయ్య, సీడీపివోలు సౌందర్య, ఉమారాణి డి సి పి ఓ కవిత, డి హబ్ స్టాప్ రమ్య, తాహసిల్దార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్త డీఈఓగా డా. బి. జగన్ మోహన్ రెడ్డి నియామకం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాశాఖలో కీలక మార్పు చోటుచేసుకుంది. జిల్లా విద్యాశాఖాధికారి గా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) స్వీకరించాలని కరీంనగర్ ప్రభుత్వ డయట్ (డీఐఈటీ) కళాశాల లెక్చరర్ డాక్టర్ బి. జగన్ మోహన్ రెడ్డిని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. ఇ. నవీన్ నికోలస్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా విద్యాశాఖ బాధ్యతలను నిర్వహిస్తున్న ఎస్. వినోద్ స్థానంలో జగన్ మోహన్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

# రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**




ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎం వి ఐ వంశీధర్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పని సరిగా ఇన్సూరెన్స్, టాక్సీలు చెల్లించి ఉండాల న్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను, కాలం చెల్లిన వాహనాలను రోడ్లపై త్రిప్పరాద న్నారు. వ్యవసాయం కోసం అనుమతి పొందిన ట్రాక్టర్లను రవాణా కోసం వినియోగించవద్దని సూచించారు. ఆటోలలో పరిమితకు మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా 6 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో కానిస్టేబుల్ ప్రశాంత్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# టీబీ నివారణకు విస్తృత పరీక్షలు..

- చందుర్తిలో మొబైల్ ఎక్స్‌రే యంత్రం ప్రారంభించిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ, వేములవాడ:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా చందుర్తి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ ఎక్స్‌రే యంత్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, 60 సంవత్సరాల పైబడినవారు, దీర్ఘకాలిక వ్యాధులు (బీపీ, షుగర్) ఉన్నవారు, గతంలో టీబీ మందులు వాడినవారు, బరువు తక్కువగా ఉన్నవారు (రక్తహీనత), టీబీ రోగుల కుటుంబ సభ్యులు ఈ మొబైల్ ఎక్స్?రే యంత్రం ద్వారా ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొబైల్ ఎక్స్?రే ద్వారా టీబీ వ్యాధిని తొందరగా గుర్తించి, వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుందని అన్నారు. చందుర్తి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత గారి ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి, మండల అభివృద్ధి అధికారి, సంబంధిత గ్రామాల సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ అనిత, డాక్టర్ వేణుగోపాల రెడ్డి, డాక్టర్ నహిమా, టీబీ యూనిట్ అధికారులు బిగిందర్, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# నితిన్ నబిన్ ఎన్నికతో బీజేపీ సిరిసిల్ల జిల్లా కార్యాలయంలో మిన్నంటిన సంబరాలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బీజేపీ నూతన జాతీయ అధ్యక్షులుగా నితిన్ నబిన్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పార్టీ కార్యాలయంపై జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు గోపి మాట్లాడుతూ.. బీజేపీలో 'సంఘటన్ పర్వ్' అనేది కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదని, అది భారతీయ ప్రజాస్వామ్యానికి ఒక మహోత్సవం వంటిదని అభివర్ణించారు. ఇతర రాజకీయ పార్టీలు కుటుంబ కేంద్రిత, వారసత్వ రాజకీయాలకే పరిమితమైన తరుణంలో.. బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అత్యంత పారదర్శకమైన ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకత్వాన్ని ఎన్నుకునే ఏకైక పార్టీ బీజేపీ అని ఆయన కొనియాడారు. జనసంఘ్ స్థాపన నుండి నేటి వరకు పార్టీకి అధ్యక్షులుగా పనిచేసిన వారందరి ప్రస్థానాన్ని గమనిస్తే, బీజేపీలో పదవులు వారసత్వంగా రావని.. కేవలం అంకితభావం, నిరంతర కృషి, ప్రజాసేవ ఆధారంగా మాత్రమే లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. అంకితభావం కలిగిన నితిన్ నవీన్ గారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కార్యదర్శి కర్నె హరీష, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, మరియు జిల్లా పదాధికారులు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వివిధ మండలాల అధ్యక్షులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మహామండపం పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ, వేములవాడ:**

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రాజన్న ఆలయంలో నిర్మాణంలో ఉన్న మహామండపం రాఫ్టింగ్ ఫౌండేషన్ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల నాణ్యత,పురోగతిపై అధికారులతో చర్చించారు. నిర్దేశిత గడువులోపు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఆలయ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా సోమవారం సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం చేసి ప్రారంభించిన సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విప్ ను అడిగి తెలుసుకున్నారు.





## అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రయాణికులు ఆటోలో సురక్షితంగా ప్రయాణిస్తున్నామనే నమ్మకం కలిగి ఉండేలా ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. అరైవ్-ూక్ష్మక్ష్మక్ష్మఎజు--ూక్ష్మఎజు కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లకు కలశాల మైదానంలో ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.ఆటో డ్రైవర్లు రోజూ వందలాది మంది ప్రయాణికుల ప్రాణ భద్రతను తమ భుజాలపై మోస్తున్నారని, అందువల్ల వారు మరింత బాధ్యతతో వ్యవహరించి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందించాల్సిన బాధ్యత డ్రైవర్లపై కలిగి ఉన్నదన్నారు. ఆటోల్లో నిర్ణయించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, అలా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్?లో పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, సీట్?బెల్ట్ మరియు హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి డ్రైవర్ వేగ పరిమితులు పాటిస్తూ,ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచిక బోర్డులను గమనిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి, బాధితులకు ప్రాథమిక సహాయం ఎలా అందించాలి అనే అంశాలపై కూడా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



## అశ్వరావుపేటలో ఆయిల్ పామ్ సాగు సందర్శనకు తరలిన సిరిసిల్ల జిల్లా రైతులు..

### జెండా ఊపి బస్సును ప్రారంభించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఆయిల్ ఫాం సాగు, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సందర్శనకు జిల్లాలోని పలు మండలాల నుంచి రైతులు సోమవారం తరలి వెళ్లే బస్ యాత్రను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ప్రారంభించారు. సిరిసిల్ల జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ఒక ప్రణాళిక ప్రకారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశాలు జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో నిర్వహించారు. అలాగే జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులకు ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం లక్ష్యాలు వ్యక్తిగతంగా కేటాయించారు. ఒక్కో పీఏసీఎస్ పరిధిలో దాని సీఈవో 100 ఎకరాలు సాగులోకి తీసుకురావాలని, మండల వ్యవసాయ అధికారికి 20 ఎకరాలు, సహాయ వ్యవసాయ అధికారికి 50 ఎకరాలు, ఉద్యానవన శాఖ అధికారులకు 200 ఎకరాల చొప్పున సాగు విస్తీర్ణం లక్ష్యమని నిర్ణయించారు. అలాగే బోయినపల్లి మండల కేంద్రంలో ఆయిల్ పామ్ సాగుతో లాభాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఏ ఏ పంట వేస్తే ఎంత దిగుబడి, లాభాలు పూర్తిగా వివరించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్ పామ్ సాగు, ఫ్యాక్టరీ సందర్శనకు తరలిస్తామని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయం సముదాయం నుంచి సోమవారం సాయంత్రం జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట ఇతర మండలాల నుంచి దాదాపు 50 మంది రైతులను కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేటకు తరలి వెళ్తుండగా, ఇంచార్జి కలెక్టర్ ప్రారంభించారు. రైతులు సాగు విధానం, లాభాలు ఇతర అన్ని అంశాలు తెలుసుకోవాలని వాటిని తాము సాగు చేయనున్న చోట అవలంబించాలి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఉద్యానవన శాఖ అధికారులు గోవర్ధన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ విలేజ్ ఎంపికకు ప్రణాళికలు..

- రూ.1 కోటి 22 లక్షలతో ప్రాజెక్ట్ అమలు ఎంఎస్ఆర్ఈ ప్రతిపాదన
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.
- పీఎం సూర్య ఘర్ పథకం కింద సమగ్ర సోలరైజేషన్ పై సమీక్ష.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మోడల్ సోలార్ విలేజ్ జిల్లాలోని ఒక గ్రామాన్ని ఎంపికకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. భారత ప్రభుత్వ నూతన, పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేస్తున్న "ప్రధానమంత్రి సూర్య ఘర్: ఉచిత విద్యుత్ యోజన ( పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలి యోజన) కింద జిల్లాలో ఇప్పటికే సోలార్ విద్యుత్ ఎక్కువ వినియోగిస్తున్న గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా అభివృద్ధి చేసేందుకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రెడ్కో, డీఆర్డీఓ, డీపీఓ సెస్ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో సంపూర్ణ సోలరైజేషన్, స్వచ్ఛ శక్తి వినియోగం, శక్తి స్వయం సమృద్ధిని ప్రదర్శించడమే ఈ మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఎంఎస్ఆర్ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా, జిల్లాస్థాయి కమిటీ ఒక గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం అమలుకు ఎంపిక చేస్తుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమలుకు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్) ను నియమించారని వివరించారు. ఎంపిక చేసిన గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి కార్యాలయాలకు విద్యుత్ ఖర్చుల భారం తగ్గించేందుకు సోలార్ పవర్ ఉపయోగపడుతుందని తెలిపారు. వీటికి సంబంధించిన అన్ని ప్రతిపాదనలు, పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.122.38 లక్షలు కాగా, ఇందులో రూ.100 లక్షలను కేంద్ర ఆర్థిక సహాయంగా (జఖీూ) ఎంఎనచవతీతీచరచవతీతీచ నుంచి కోరుతున్నారని, మిగితా రూ.22.38 లక్షలను గ్రామ పంచాయతీ వాటాగా సమకూర్చనున్నారని రెడ్కో అధికారులు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, రెడ్కో అధికారి లక్ష్మీ కాంతరావు, సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి , ఎల్డీఎం మల్లికార్జున రావు, డీపీఓ కార్యాలయ ఏవో నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి..



- 109 దరఖాస్తుల రాక
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. మొత్తం దరఖాస్తులు 109 వచ్చాయి. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పరిహారం చెక్కు అందించిన ఇంచార్జి కలెక్టర్ సెర్ప్ లో సీసీ గా విధులు నిర్వర్తిస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిహారం చెక్కును అందజేశారు. ఇల్లంతకుంట మండలంలో సెర్ప్ లో సీసీ సదయ్య మరణించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ స్త్రీనిధి ద్వారా రూ. లక్ష 50 వేల పరిహారం చెక్కును సదయ్య భార్య మంద సరళ కు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ గీత, అద నపు డీఆర్డీఓ శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్ఎం భూ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లెల్ల రాముని బండ భక్తజనసంద్రం

- వైభవంగా సీతారాముల కళ్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు
- అన్నప్రసాదం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ



**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని రాముని బండపై వెలిసిన సీతారామస్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనసంద్రంగా మారింది. కన్నుల పండువగా కళ్యాణ వేడుక.. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాముని బండ పై జరుగుతున్న సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మాజీ టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్ రావు, బీఆరచవతీతీచస జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య,యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు మిరాల భాస్కర్ యాదవ్,సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, బిఆరచవతీతీచస జిల్లా నాయకులు బొల్లి రామ్మోహన్, జక్కుల నాగరాజు, వలకొండ వేణుగోపాలరావు, నవీన్ రావు, మోతే మహేష్ లు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుబ్బాక రజిత రమేష్, సీతారాముల ఆలయ కమిటీ అధ్యక్షులు మాదారపు సత్తిరెడ్డి,ఉప సర్పంచ్ కరుణాకర్, మాజీ సర్పంచ్ మాట్ల మధు, మాజీ ఎంపీటీసీ వెంకట్రావు, మాజీ ఫ్యాక్స్ ఛైర్మన్ విజయేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సతీష్ రెడ్డి, మాజీ ఫ్యాక్స్ డైరెక్టర్ అనిల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గీసా నర్సయ్య, అబ్బాడి తిరుపతి రెడ్డి, కోమిటి రాజిరెడ్డి, తుపాకుల సత్తయ్య, బోల్గం శ్రీనివాస్ గౌడ్, నర్రా శ్రీనివాస్ రెడ్డి, కొత్తపెల్లి శ్రీనివాస్, బండి శ్రీను, సంజీవ్ రెడ్డి వార్డు సభ్యులు, గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ విద్యాలయాల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మైనార్టీ విద్యాలయాల ప్రవేశాల పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం టీజీఎంఆరచవతీతీచఐఎస్ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి ఎం.ఎ.భారతి, బాలికల, బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ ఉరూస ఫాతిమ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# మెట్రో ఫేజ్-2 వేగవంతం చేయండి

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ లేఖ.**

**బలగం టీవీ, హైదరాబాద్:**

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం భారత ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో జరిగిన సమావేశం మేరకు, మెట్రో ఫేజ్-క్ష్మీక్ష్మీ కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిన కార్యక్రమాలన్నీ చేపడుతోందని తెలియజేస్తూ ముఖ్యమంత్రి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి లేఖ రాశారు.



హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఇద్దరు అధికారులతో కూడిన ఒక సంయుక్త కమిటీలో చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇద్దరు అధికారులను నామినేట్ చేసేందుకు వేచి చూస్తోందని కిషన్ రెడ్డి జనవరి 15 వ తేదీన రాసిన లేఖలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ, దానికి సంబంధించిన వివరాలను కూడా ముఖ్యమంత్రి గారు తన లేఖలో తెలియజేశారు.

కమిటీ కూర్పునకు సంబంధించిన వివరాలను ఇప్పటికే కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. మెట్రో రైల్ ఫేజ్-క్ష్మీక్ష్మీ మంజూరు కోసం నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని, ఎంతో కాలంగా పెండింగ్?లో ఉన్న ఫేజ్-క్ష్మీక్ష్మీ ప్రాజెక్టును తన పలుకుబడిని ఉపయోగించి వీలైనంత తొందరగా ఆమోదింపజేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి రాసిన లేఖలో కోరారు.

# పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలి

- **జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ..**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏ సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే మున్సిపల్ కార్యాలయాన్ని ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఎసచవతీతీచసీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో విధులు నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, మాస్టర్ ట్రెయినర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి..



- **శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి.**
- **నో హెల్మెట్.. నో పెట్రోల్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలి.**
- **రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ అధికారులంతా బాధ్యతగా పని చేయాలి.**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

నేర సమీక్షా సమావేశం పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నేరస్తులకు తప్పకుండా శిక్ష పడేలా కృషి చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. పెండింగ్లో ఉన్న కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రాసిక్యూషన్లో భాగంగా కోర్టు వారు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా అధికారులు అందరూ బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా పరమైన అన్ని చర్యలు చేపట్టాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపాలని, ప్రతి రోజు రౌడి, హిస్టరీ షీటర్స్ ని తనిఖీ చేస్తూ వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం, అక్రమ ఇసుక రవాణా లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన సేవనంపై కఠినంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. ౹ూతీతీఱజవ ఖశ్రీఱజవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వాహనదారులకు, ప్రజలకు, విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, నో హెల్మెట్ నో పెట్రోల్ పై వాహనదారులకు అవగాహన కల్పించాడంతో పాటుగా పెట్రోల్ బంక్ ల వద్ద నో హెల్మెట్.. నో పెట్రోల్ ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి ఐపీఎస్., అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వేంకటేశ్వర్లు, శ్రీనివాస్, డిసిర్బీ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, పిసిఆర్ ఇన్స్పెక్టర్ మధుకర్, ఆర్.ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.






# సీఎంకు ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం

**బలగం టీవీ, హైదరాబాద్**

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు--2026లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్?లోని జ్యూరిచ్ నగరానికి చేరుకుంది. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రతినిధి బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. స్విట్జర్లాండ్లోని భారత రాయబారి మృదుల్ కుమార్తో పాటు ఇతర అధికారులు జ్యూరిచ్ ఎయిర్పోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలు, పెట్టుబడుల అవకాశాలపై వారు చర్చించినట్లు సమాచారం.

దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. మరోవైపు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇప్పటికే దావోస్కు చేరుకొని సమావేశాలకు సిద్ధమయ్యారు. దావోస్లో నాలుగు రోజుల పాటు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో తెలంగాణ ప్రతినిధి బృందం చురుగ్గా పాల్గొననుంది. సమావేశాల తొలి రోజున వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ కంపెనీల పారిశ్రామికవేత్తలతో జరిగే కీలక సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' రోడ్మ్యాప్ను ప్రపంచ వేదికపై పరిచయం చేయనున్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించడంపై ముఖ్యమంత్రి ప్రధానంగా దృష్టి సారించనున్నారు. గత డిసెంబర్?లో ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్?లో ప్రతిపాదించిన అభివృద్ధి నమూనాకు అనుగుణంగా సుస్థిర పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఔజుఖీ--2026లో తన అజెండాను ముందుకు తీసుకెళ్లనుంది.

## ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా.. 13 మందికి గాయాలు

**బలగం టీవీ, భద్రాద్రి కొత్తగూడెం**

ఓ ప్రయివేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి బోల్తా పడటంతో దాదాపు 13 మందికి గాయాలైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీఆర్ ట్రావెల్స్కు చెందిన బస్సు రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో మండలంలోని గట్టుగూడెం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దాదాపు 43 మంది ప్రయాణికులతో ఈ బస్సు వెళ్తుంది. తెల్లవారు జామున దాదాపు 2గంటల సమయంలో బోల్తాపడగా గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు భయంతో ఆర్తనాదాలు చేశారు. జాతీయ రహదారి కావడంతో వాహన దారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందిం చిన ఎస్ఐ సాయి కిషోర్రెడ్డి.. ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను నాలుగు అంబులెన్స్లతో పాటు మరొక ప్రయివేట్ అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మాట్లాడుతూ.. బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో అదుపుతప్పి బోల్తా పడినట్టు చెప్పారు. కాగా, ఈ బస్సు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉండటం గమనార్హం. ఈశాన్య రాష్ట్రాల్లో పన్నులు తక్కువగా ఉండటంతో అక్కడ రిజిస్ట్రేషన్ చేసుకొని తెలుగు రాష్ట్రాల్లో యధేచ్ఛగా బస్సులను తిప్పుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సిరిసిల్ల డిపోలో ఘనంగా 'జాతీయ రహదారి భద్రత' అవగాహన సదస్సు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు--2026లో భాగంగా సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతపై మంగళవారం భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రకాష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రహదారి ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ స్టేట్ డ్రైవింగ్ ఇన్స్టిట్యూట్ ఇన్స్ట్రక్టర్ మరియు రాజన్న సిరిసిల్ల ఏఎమ్వీఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డ్రైవర్లు రహదారిపై పాటించాల్సిన కీలకమైన భద్రతా సూత్రాలను వివరించారు. అతి వేగం, అజాగ్రత్త వల్ల కలిగే అనర్థాల గురించి, సిగ్నల్స్ పాటించడం, వాహనాల ఫిట్నెస్పై అవగాహన కల్పించారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డిపో మేనేజర్ ప్రకాష్ రావు మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. అనంతరం, ప్రమాదాల నివారణకు రహదారి భద్రత నియమాలను తూచా తప్పకుండా పాటిస్తామని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపో సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్లతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు మరియు అన్ని కేటగిరీల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల

# ప్రతి ఇంట్లో పోరాట గాథ ఉంది

- **సీపీఐ శత వసంతాల జాతీయ సెమినార్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**




**బలగం టీవీ, ఖమ్మం**

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఏ ఇంటి తలుపు తట్టినా ఒక పోరాట చరిత్ర వినిపిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో సీపీఐ శత వసంతాల సందర్భంగా నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1950లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో కౌలుదారి చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. అనంతరం 1970లో దేశవ్యాప్తంగా భూ సంస్కరణల చట్టం, పేదల అభివృద్ధికి 20 సూత్రాల పథకం వంటి కీలక సంస్కరణలను వామపక్ష పార్టీల సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయగలిగాయని పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లా అనేక రకాల భావజాలాల వ్యాప్తికి ఆహ్వానం పలికే నేల అని, అతిథి సత్కారానికి మారుపేరుగా నిలిచిందని భట్టి విక్రమార్క అన్నారు. దేశవ్యాప్తంగా వామపక్ష నాయకులు ఖమ్మం జిల్లాలో సమావేశం కావడాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నానని, అభినందిస్తున్నానని తెలిపారు. సీపీఐకి వందేళ్ల చరిత్ర ఉందని, ఈ ప్రయాణంలో ఎన్నో త్యాగాలు, ఆటుపోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో సీపీఐ పాత్ర ఎంతో కీలకమైందని ఆయన స్పష్టం చేశారు.

భారతదేశానికి 1947లో స్వాతంత్రం వచ్చినప్పటికీ, తెలంగాణ ప్రాంతానికి ఏడాది తర్వాత స్వాతంత్ర్యం లభించిందని తెలిపారు. నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేపట్టిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికి ఒక కొత్త సందేశాన్ని ఇచ్చిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు హక్కును నిర్వీర్యం చేస్తోందని, రాజ్యాంగంలో మార్పులు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని భట్టి విక్రమార్క ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీతో పాటు వామపక్ష పార్టీలు కలిసి దేశంలో సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలు, అవినీతిపై ప్రశ్నిస్తూనే ఉంటాం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం జారీ చేసిన నోటీసులకు బాధ్యతాయుతమైన నాయకుడిగా మాజీ మంత్రి హరీశ్?రావు హాజరయ్యారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ అడ్డగోలు సిట్ విచారణల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డబ్బుల కట్టలతో దొరికిన నేరచరిత్ర ఉందని, అదే ముద్రను ఇతరులపై అంటించాలనే దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. అధికారం చేతికి వచ్చినా రేవంత్ రెడ్డి బుద్ధి మారలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కామ్?ల పార్టీగా మారిందని, ఒక మంత్రి 20 శాతం, మరో మంత్రి బ్యాగ్?మ్యాన్?గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఇప్పటివరకు ఒక్క అధికారిక ప్రకటన కూడా రాలేదని, కేవలం లీకుల ఆధారంగా రాజకీయ డ్రామా నడుపుతున్నారని కేటీఆర్ అన్నారు. గతంలో హరీశ్?రావుపై నమోదైన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. అయినప్పటికీ హరీశ్?రావును ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. సింగరేణి టెండర్ల అంశంపై మాట్లాడుతూ, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా భారీ అవినీతి జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. తొమ్మిది సింగరేణి టెండర్లను ముఖ్యమంత్రి కుటుంబమే నియంత్రించిందని, అంచనా విలువకన్నా అధికంగా టెండర్లు వేయించారని పేర్కొన్నారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే కొత్త నిబంధనను పెట్టి అర్హులైన కంపెనీలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో జరుగుతున్న ఈ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ వ్యవహారంపై మౌనం పాటించడాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్య సంస్థకు నష్టం జరుగుతున్నా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమై, అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని కేటీఆర్ విమర్శించారు. ఇలాంటి నోటీసులు ఎంతమందికి ఇచ్చినా, ఎన్ని సిట్‌లను వేసినా బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి బీఆరచవతీతీచస్ ప్రతీక అని, కేసీఆర్?కు నోటీసులు ఇచ్చినా భయపడబోమని అన్నారు. పోలీస్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటే భవిష్యత్తులో దాని ప్రభావం తప్పదని హెచ్చరించారు. అక్రమమని తెలిసి కేసులు పెట్టిన వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. మరో రెండు సంవత్సరాల్లో తిరిగి బీఆరచవతీతీచస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని కేటీఆర్ అన్నారు.

# సిట్ కాదు.. ట్రాష్

- **బావమరిది కుంభకోణం బయటపెట్టినందుకే కక్ష సాధింపు**
- **మాజీ మంత్రి హరీష్ రావు**




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కుంభకోణాన్ని బయటపెట్టినందుకే తనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పేరుతో కక్ష సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్?ఎస్ నేత హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. సిట్ విచారణను ఉద్దేశించి “సిట్ కాదు.. అది ట్రాష్” అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరైన అనంతరం మంగళవారం సాయంత్రం తెలంగాణ భవన్?లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

“ఫోన్ ట్యాపింగ్ కేసులో నాపై పూర్తిగా నిరాధార ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి జారీ చేసిన సిట్ నోటీసు పూర్తిగా ట్రాష్. సిట్ అధికారులు విచారణ పేరుతో గంటల తరబడి ప్రశ్నలు వేసి, మధ్యలో ఫోన్ వచ్చిందని బయటకు వెళ్లడం తప్ప మరేమీ చేయలేదు. ఆ ఫోన్ రేవంత్ చేశాడో, సజ్జనార్ చేశాడో తెలియదు” అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఎన్నిసార్లు పిలిచినా సిట్ విచారణకు హాజరవుతానని స్పష్టం చేసిన హరీష్ రావు, కేసీఆర్ నాయకత్వంలో గతంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. “మీరు ఇచ్చిన నోటీసులను నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా” అని వ్యాఖ్యానించారు.

ఫోన్ ట్యాపింగ్ అంశంలో హైకోర్టు, సుప్రీంకోర్టు రెండూ తనపై నమోదైన కేసులను కొట్టివేశాయని హరీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా తనకు నైతిక మద్దతు తెలిపిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్?కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘీభావం ప్రకటించిన పార్టీ నేతలందరికీ శిరసువంచి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

బొగ్గు కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జికి అన్ని ఆధారాలు సమర్పిస్తామని హరీష్ రావు ప్రకటించారు. ఈ కుంభకోణంలో తొలి లబ్ధిదారుడు సీఎం బావమరిది సృజన్ రెడ్డేనని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణానికి అతడే తెరతీశాడని అన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి టెండర్లలో సైట్ విజిట్ అంశాన్ని ప్రశ్నించామని, దేవుడిపై ఒట్లు వేసి మోసం చేశావంటూ వ్యాఖ్యానించినందుకు యాదాద్రిలో తనపై కేసు పెట్టించారని తెలిపారు. “ఏదో ఒక కేసులో నన్ను ఇరికించాలనే ప్రయత్నం జరుగుతోంది” అని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల మయంగా మారిందని హరీష్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ స్కాములపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

# నితిన్ బాస్, నేను ఒక పార్టీ కార్యకర్తను.

- **నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. ఆయన బాధ్యత కేవలం పార్టీ నిర్వహణకే పరిమితం కాదని, ఎన్డీఏ మిత్రపక్షాల మధ్య సమన్వయం కూడా ఆయన కీలక బాధ్యతేనని పేర్కొన్నారు. “పార్టీ విషయానికి వస్తే, నితిన్ బాస్, నేను ఒక పార్టీ కార్యకర్తను. ఇప్పుడు గౌరవనీయులైన నితిన్ నబీన్ జీ మనందరికీ అధ్యక్షుడు. అని అన్నారు.రాబోయే 25 సంవత్సరాలు దేశ భవిష్యత్తుకు కీలకమని, ఈ కాలంలో అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడం ఖాయమని మోదీ చెప్పారు. నితిన్ నబీన్ యువశక్తి, అనుభవం పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆర్థిక, సామాజిక, సాంకేతిక మార్పులను ప్రత్యక్షంగా చూసిన తరానికి చెందిన నేతగా ఆయన పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తారని తెలిపారు.

బీజేపీ చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత 12 ఏళ్లలో దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయాలు సాధించిందని గుర్తు చేశారు. తొలిసారిగా పశ్చిమ బెంగాల్, తెలంగాణలో కూడా అధికారంలోకి రానున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ఎప్పుడూ అభివృద్ధి మోడల్?ను ముందుకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. దిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

బీజేపీలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కావచ్చని మోదీ తెలిపారు. పార్టీ నిర్ణయాలు, నాయకత్వ ఎంపిక పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతాయని చెప్పారు. దేశ సేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని, కార్యకర్తే కేంద్రంగా పార్టీ సిద్ధాంతాలు ఉంటాయని వివరించారు. బీజేపీ కార్యకర్త అని అనిపించుకోవడమే తనకు గర్వకారణమని ప్రధాని పేర్కొన్నారు. ఎల్‌కే అడ్వాణీ, వెంకయ్య నాయుడు వంటి సీనియర్ నేతల నాయకత్వంలో పార్టీ ఘన విజయాలు సాధించిందని గుర్తు చేశారు. అందరి కృషితోనే వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చే స్థాయికి బీజేపీ ఎదిగిందన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం బలంగా ఉందని తెలిపారు. పార్టీలో ప్రతి కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. కాలానుగుణంగా మార్పులను స్వీకరించాల్సిన అవసరం ఉందని, రేడియో నుంచి ఏఐ పరిజ్ఞానం వరకు అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను వినియోగించుకోవాలని సూచించారు. పార్టీ బాధ్యతలను జీవనశైలిగా భావించాలని చెప్పారు. బాధ్యతలు మారినా, నాయకత్వం మారినా లక్ష్యం మాత్రం మారకూడదని స్పష్టం చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. గతంలో గెలవని రాష్ట్రాల్లో కూడా బీజేపీ విజయాలు సాధించిందని మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్, తెలంగాణతో పాటు కేరళలో కూడా బీజేపీకి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేశంలో ప్రతి పార్టీకి ఒక్కో విధానం ఉంటే, కాంగ్రెస్ పార్టీది కుటుంబ పాలన మోడల్ అని విమర్శించారు. బీజేపీ మాత్రం అభివృద్ధి మోడల్‌తో ముందుకు సాగుతోందన్నారు.

# 7 గంటల విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చెప్తుంటారు, వాటన్నిటినీ నమ్మేస్తామా అంటూ హరీశ్‌రావు సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. ప్రశ్నల పరంపరను అధికారులు కొనసాగించగా.. నాకు సంబంధం లేనివి, నేను తలదూర్చని, నాకు తెలియని ప్రశ్నలు వేస్తే ఎలా అంటూ హరీశ్‌రావు ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావుతో పాటు తాము ఇది వరకు అరెస్ట్ చేసి ప్రశ్నించిన అధికారులతో హరీశ్‌రావు పలుమార్లు మాట్లాడిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయనీ, ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంతో పాటు అంతకముందు జరిగిన ఉప ఎన్నికల సందర్భంలో సదరు అధికారులతో పలుమార్లు మాట్లాడిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని సిట్ అధికారులు సూటిగా ప్రశ్నించగా... కొన్ని సందర్భాల్లో మాట్లాడుతూ ఉంటాం, అంత మాత్రానా తప్పు చేసినట్టా అని కూడా హరీశ్‌రావు అధికారులకు చెప్పినట్టు తెలిసింది. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లను ఎందుకు మీరు ప్రశ్నించరని కూడా హరీశ్‌రావు సిట్ అధికారులను నిలదీసినట్టు సమాచారం.

అధికారులు వేసిన కొన్ని ప్రశ్నలను దాటవేసిన హరీశ్‌రావు మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉండిపోయారని సమాచారం. మధ్యలో ఈ ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలన్నీ కూడా రాజకీయ ప్రేరేపితమైనవేననీ, ఈ ట్రాప్‌లో మీరెందుకు పడుతున్నారంటూ అధికారులతో హరీశ్‌రావు అన్నట్టు తెలుస్తోంది. అయితే తాము ఫోన్‌ట్యాపింగ్ కేసును పూర్తిగా చట్టపరిధిలోనే లభిస్తున్న ఆధారాలనుబట్టి దర్యాప్తు సాగిస్తున్నామనీ, ఇందులో ఎవ్వరి ఒత్తిడీ లేదని అధికారులు స్పష్టం చేసినట్టు తెలిసింది. కాగా అధికారులకు మధ్యమధ్యలో సిట్ అధినేత, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తగిన ఆదేశాలిస్తూ ఈ విచారణను స్వయంగా పర్యవేక్షించారు. రాత్రి 7 గంటల వరకు సాగిన విచారణ ప్రక్రియను పూర్తిగా వీడియో చిత్రీకరణ చేయడంతో పాటు హరీశ్‌రావు వాంగ్మూలాన్ని కూడా అధికారులు రికార్డు చేశారు. అనంతరం 7.29 గంటలకు హరీశ్‌రావు వెలుపలికి రాగా... బయట వేచి ఉన్న వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు అభివాదం చేస్తూ తాను తెలంగాణ భవన్‌లో మాట్లాడతానని చెప్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కాగా హరీశ్‌రావును విచారిస్తున్నంత సేపు ఇంకెంత సేపు విచారిస్తారు. ఆయనను లోపల వేధిస్తున్నారంటూ కొందరు మహిళా కార్యకర్తలు లోపల పోలీసు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో అక్కడ పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారడంతో అధికారులు వారిని అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి తరలించారు. హరీశ్‌రావు విచారణ సాగినంత సేపు జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఒకవైపు హరీశ్‌రావును ప్రశ్నించే ప్రక్రియ జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో కొనసాగుతుండగా.. వెలుపల భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు హరీశ్‌రావుకు మద్దతుగా చేసిన నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కార్యాల యం వైపు దూసుకొస్తున్న కార్యకర్తలను సాయుధ పోలీసులు పలుమార్లు వెనక్కి నెట్టేయడం, వినకు ండా తోసుకు వచ్చినవారిని అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించడం వంటి చర్యలు పలుమార్లు చోటు చేసుకున్నాయి.